క్లుప్తంగా

ఉత్తమ సేవలకు అవార్డు



అవార్డు అందుకుంటున్న అంజనీపుత్ర సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్

మంచిర్యాలఅర్బన్: హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గణేశ్ నవరాత్రుల్లో భాగంగా విశిష్ట పూజలు, వివిధ కార్యక్రమాలు నిర్వహించిన ఉత్తమ గణేష్ మండళ్లకు బహుమతులు అందజేశారు. సున్నంబట్టీ వందపీట్ల రహదారిలో ఏర్పాటు చేసిన అంజనీపుత్ర ఏర్పాటు చేసిన గణేశ్ మండలి (ప్రథమ), మేదరివాడలో గణేశ్ మండలి(ద్వితీయ), చింతపండువాడలోని సిద్ధి వినాయక గణేశ్ మండలికి తృతీయ బహుమతి అందజేశారు. 271వినాయక మండపాల్లో అన్ని విభాగాల్లో అగ్రభాగాన నిలిచి ప్రథమ బహుమతి సాధించడం గర్వంగా ఉందని అంజనీ పుత్ర ఎస్టేట్స్ చైర్మన్ గుర్రాల శ్రీధర్, ఎండీ పిల్లి రవి తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జగ్గరి సుమతి సంజీవ్, సభ్యులు అప్పాని నాగరాజ్, గొంగళ్ల శంకర్, శ్రీనివాస్, రాజు, శివరాజ్, మేకల సంపత్, మందల రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు వనితా వాక్కు ఆధ్వర్యంలో 2కె రన్

మంచిర్యాలటౌన్: అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం 6:30గంటలకు ఐబీ చౌరస్తా నుంచి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానం వరకు 2కె రన్ నిర్వహిస్తున్నట్లు వనితావాక్కు వ్యవస్థాపకుడు రంగు వేణు కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రేపటితరం ఆడపిల్లల భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న 2కె రన్‌లో కలెక్టర్ బదావత్ సంతోశ్, అదనపు కలెక్టర్ బి.రాహుల్, సబావత్ మోతీలాల్, డీసీపీ సుధీర్ రామ్నాథ్ కేతన్, జిల్లా న్యాయమూర్తులు, అధికారులు, న్యాయవాదులు, మేధావులు, విద్యావంతులు పాల్గొంటారని, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బాధ్యతలు స్వీకరణ



వేణుగోపాల్

జన్నారం: మండల తహసీల్దార్‌గా వేణుగోపాల్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజలు సహకరించాలని, ఎన్నికల నిర్వహణలో అందరం కలిసి విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సిబ్బంది స్వాగతం పలికారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించుకోవాలి

లక్సెట్టిపేట: రాబోవు ఎన్నికలను ప్రజలు సజావుగా నిర్వహించుకోవాలని సీఐ క్రిష్ణ అన్నారు. మండలంలోని చందారం గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాజకీయ పార్టీల నాయకులు ఎటువంటి గొడవలు చేసుకోవద్దని, ఇరువర్గాల వారు ఇబ్బందులు లేకుండా ఎన్నికలను జరుపుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందునా, అల్లర్లు జరిగితే కేసులు నమోదు చేస్తామని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై లక్ష్మణ్, ఏఎస్సై రాజయ్య, హెడ్ కానిస్టేబుల్ సుభాష్, గ్రామ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఎస్‌పై సమీక్ష



సమీక్ష సమావేశంలో ఎంఈవో, హెచ్ఎంలు

దండేపల్లి: ఫెషియల్ రికగ్నైజ్ అటెండెన్స్(ఎఫ్ఆర్ఎస్)ను పూర్తిచేయాలని ఎంఈవో రవీందర్ సూచించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలోని కాంప్లెక్స్ హెచ్ఎంలు, ఉన్నత పాఠశాల హెచ్ఎంలు, ఎంఐఎస్, సీఆర్పీలతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. యూడైస్ ప్లస్, ఎఫ్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్, డ్రాప్‌బాక్స్ క్లియరెన్స్, గురించి చర్చించారు. ఏవీ కూడా పెండింగ్‌లో పెట్టకూడదన్నారు. ఎంఐఎస్ నగేష్, సీఆర్పీలు, నర్సయ్య, సురేందర్, రమేష్, రాజ్‌మహమ్మద్, శ్రావణ్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

కాసిపేట: విద్యార్థుల హాజరుశాతం, మధ్యాహ్న భోజనం వివరాలు ఇక నుంచి ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా నిర్వహించనున్నట్లు, ఉపాధ్యాయులు యాప్‌పై అవగాహన కలిగి ఉండాలని మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ సూచించారు. ఎమ్మార్సీలో మండల స్థాయి యూడైస్ ప్లస్, డీఎస్ఈ ఎఫ్ఆర్ఎస్ యాప్‌లపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లంబాడితండా జెడ్పీ హెచ్ఎం లచ్చయ్య, సీసీవో రాంబాబు, ఎంఐఎస్ సౌజన్య, సీఆర్పీలు తిరుపతి, వకుళాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దండేపల్లి: ముత్యంపేటలో గోడపై రాతలు చెరిపేస్తున్న అధికారులు



చెన్నూర్‌లో ఫ్లెక్సీలు తొలగిస్తూ..

ఎన్నికల నియమావళి షురూ..!

దండేపల్లి/చెన్నూర్/కాసిపేట/బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం నుంచి కోడ్ అమల్లోకి రావడంతో ఎన్నికల అధికారులు అలర్ట్ అయ్యారు. జిల్లాలోని పలు మండలాల్లో ఎన్నికల నియమావళికి అనుగుణంగా చర్యలు చేపట్టారు. బెల్లంపల్లిలో ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన గోడల మీద ప్రధాన రాజకీయ పక్షాలు రాతలు రాయించారు. ఎన్నికల అధికారులు మంగళవారం నుంచి రాజకీయపక్షాలు రాయించిన రాతలను చెరిపి వేసే చర్యలకు ఉపక్రమించారు. ప్రత్యేకంగా కూలీలతో గోడల మీద రాయించిన రాతలను సున్నం పూయించి చెరిపేస్తున్నారు. ఏ రాజకీయ పార్టీ రాతలు కనిపించకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఫ్లెక్సీలు కూడా తొలగించారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా ఎన్నికల అధికారులు వ్యవహరించడంతో ఇప్పటివరకు దర్శనమిచ్చిన గోడల మీద రాతలు, ఫ్లెక్సీలు మటుమాయమయ్యాయి. చెన్నూర్ మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన వివిధ పార్టీల ఫ్లెక్సీలు, వాల్ రైటింగ్స్, జెండాలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ప్రధాన రహదారులతో పాటు కాలనీల్లో సైతం ఏర్పాటు చేసిన జెండాలను వాల్ రైటింగ్‌లను తొలగించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఫ్లెక్సీలతో పాటు పార్టీ జెండాలు, వాల్ రైటింగులకు అనుమతి లేదని నియోజకవర్గ ఎన్నికల అధికారి సిడాం దత్తు తెలిపారు. కాసిపేట మండలంలోని లంబాడితండా, సోమగూడెం, కాసిపేట గ్రామపంచాయతీ, దేవాపూర్ కాసిపేట ఎక్స్‌రోడ్‌లో ఎంపీడీవో ఎంఏ అలీం పర్యటించి రాజకీయ పార్టీల పోస్టర్లు, బ్యానర్లు తొలగించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. దండేపల్లిలోని ముత్యంపేటలో గోడలపై రాతలను సున్నంతో చెరిపేశారు. 108అంబులెన్సుపై ఉన్న కేసీఆర్ ఫొటో కనబడకుండా పేపర్ అంటించారు.



కాసిపేటలో పోస్టర్ తొలగిస్తున్నన్న సిబ్బంది



బెల్లంపల్లి: గోడల మీద రాతలు చెరిపేస్తూ...



దండేపల్లిలో రాతలు చెరిపేస్తూ...

బీఆర్ఎస్‌లో యువకుల చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లిరూరల్: మండలంలోని ఆకెనపల్లి గ్రామానికి చెందిన సుమారు 20 మంది యువకులు మంగళవారం బీఆర్ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, ఆకెనపల్లి ఎంపీటీసీ సుభాష్‌రావు, నాయకులు లక్ష్మణ్, వెంకటేష్, శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి 34వ వార్డుకు చెందిన యువకులు మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఏఎంసీ ఏరియాలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో చేరికలు జరిగాయి. వివిధ రాజకీయ పార్టీల్లో పని చేస్తున్న 30మంది యువకులు గులాబీ తీర్థం పుచ్చుకోగా, వీరికి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ గెల్లి రాజలింగు, బీఆర్ఎస్ శ్రేణులు, యువకులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళా కార్యక్రమం వినియోగించుకోవాలి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

జన్నారం: మహిళల కోసం నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని మహిళలు వినియోగించుకోవాలని జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆరోగ్య మహిళా కార్యక్రమం కింద చేపడుతున్న పరీక్షలు, వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. వైద్య సేవలు అందిస్తున్న విధానం, సిబ్బంది పనితీరుపై వైద్యురాలు ఉమశ్రీని అడిగి తెలుసుకున్నారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి

దండేపల్లి: వైద్యంతో పాటు, వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు వైద్య సిబ్బందికి సూచించారు. దండేపల్లి మండలం తాళ్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం విజిట్ చేశారు. పీహెచ్‌సీ వైద్యుడు క్రాంతికుమార్‌తో మాట్లాడారు. సీజనల్ వ్యాధుల తీవ్రతపై చర్చించారు. మందులు అందుబాటులో ఉంచాకోవాలని సూచించారు. ఓపీ ఎంత మంది వస్తున్నారని ఆరా తీశారు.

యోగితకు నాట్యమయూరి అవార్డు



యోగితను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జోబిన్

మంచిర్యాలఅర్బన్: హైదరాబాద్ రవీంద్రభారతిలో నాట్యకళా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన కూచిపూడి నృత్య పోటీల్లో స్థానిక శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన రాగుల యోగిత ప్రతిభ కనబరిచి నాట్యమయూరి అవార్డు అందుకున్నారు. పాఠశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ జోబిన్, ఉపాధ్యాయులు అభినందించారు.

స్ఫూర్తిదాయక చిహ్నాలు ఏర్పాటు చేయాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రం ఐబీ చౌరస్తాలోని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఉన్న జంక్షన్ అభివృద్ధి పనుల్లో భాగంగా ఆ జంక్షన్‌లో స్ఫూర్తిదాయకంగా ఉండే చిహ్నాలు ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం సమతా సైనిక్‌దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గం సిద్దార్థ రాంమూర్తి అధ్యక్షతన ప్రజాసంఘాలు మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, చైర్మన్ పెంట రాజయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐబీ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం ఉందని, ఆ సర్కిల్ వెడల్పు పనుల్లో సింహం, ఏనుగు, గుర్రం, ఆవు చిహ్నాలను ఏర్పాటు చేయాలని చూస్తున్నారని, వాటికి బదులుగా బాబాసాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తిదాయకంగా కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, ఉప్పల్ క్రాస్‌రోడ్డు, పంజాగుట్టలోని అంబేద్కర్ సర్కిల్ మాదిరిగానే ఐబీ చౌరస్తాలోనూ ఏర్పాటు చేయాలని కోరారు. రాజముద్ర, అశోకచక్రం, భీమకొరెగావ్ స్థూపం, రాజ్యాంగ పీఠిక పుస్తకం వంటి చిహ్నాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ, నేతకానీ మహర్ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ అధ్యక్షుడు దుర్గం స్వామి, దూర్రే మోహన్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాడి రాజేశ్, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి నరేశ్, మాల మహానాడు జిల్లా నాయకులు దుర్గం శాంతయ్య, బీఎస్పీ జిల్లా నాయకులు పుట్ట మధు పాల్గొన్నారు.

సరిహద్దు ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సిడాం దత్తు

చెన్నూర్: రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి సిడాం దత్తు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ.. ప్రధాన రహదారుల గుండా వచ్చే వాహనాలను తనిఖీ చేయాలన్నారు. సరైన పత్రాలు లేకుండా డబ్బు, బంగారు, వెండి నగలు, మద్యం తరలించకుండా ఎన్నికల ప్రత్యేక బృందం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రూ.50వేలకు మించి, మద్యం రూ.10వేలకు మించి తీసుకెళ్తే వెంటనే సీజ్ చేయాలన్నారు. వాహనాల తనిఖీ నుంచి వస్తువులు, డబ్బు, ఇతర నగల స్వాధీనాన్ని వీడియో తీయాలన్నారు. ప్రతి వాహనాన్ని సోదా చేయాలని, ఏ ఒక్క వాహనాన్ని తనిఖీ చేయకుండా వదిలేయొద్దని సూచించారు. గ్రామాల్లో, పట్టణాలలో కాలనీల్లో ఉచిత పంపిణీలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ చేపట్టాల్సిన విధులను వివరించారు. సమావేశంలో జైపూర్ ఏసీపీ మోహన్, చెన్నూర్ తహసీల్దార్ పురుషోత్తం, సీఐలు వాసుదేవరావు, విద్యాసాగర్, ఎన్నికల డీటీ లక్ష్మీనారాయణ, నియోజకవర్గంలోని ఎంపీడీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



మందమర్రి జెడ్పీఎస్ఎస్ పూర్వ విద్యార్థులు

అ‘పూర్వ’ సమ్మేళనం

మంచిర్యాలటౌన్: మందమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1979–80 ఎస్ఎస్సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్లో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కష్టాల్లో ఉన్న ఓ మిత్రుడికి రూ.50వేల ఆర్థిక సాయం చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో కన్వీనర్ లగిశెట్టి చంద్రమౌళి, కో కన్వీనర్ శ్రీవాణి, అంజలి, ఎం.కవిత, ఏ.రాజయ్య, ఎం.కాంతారావు, పి.వెంకటస్వామి, వెంకట్రావు, రాజారెడ్డి, వెంకటేశ్వర్లు, శంకర్ పాల్గొన్నారు.

వృత్తి కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి



ఎంపికైన శిక్షకులతో జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత వృత్తి శిక్షణ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి తెలిపారు. వృత్తి కోర్సులకు సంబంధించి శిక్షణ ఇచ్చే శిక్షకుల ఎంపిక కోసం మంగళవారం ఇంటర్వ్యూలను నిర్వహించారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి, పలువురు అభ్యర్థులు హాజరయ్యారు. వీరికి అధికారులు ఇంటర్వ్యూలు చేసి శిక్షకులుగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, జూట్ బ్యాగ్ తయారీతో పాటు యోగా తదితర వాటిల్లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. సింగరేణి అందిస్తున్న ఈ శిక్షణ సద్వినియోగం చేసుకొని, మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. కోర్సులు నేర్చుకొని సొంత యూనిట్‌లు పెట్టుకున్న వారికి హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో స్టాల్‌ను పెట్టుకోవడానికి కంపెనీ అవకాశం కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటూ జీఎం రఘుకుమార్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, డీజీఎం ఐఈడీ చిరంజీవి, అకౌంట్స్ అధికారి పద్మ, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కాంతారావు పాల్గొన్నారు.

‘ట్రేడ్స్‌మెన్‌లకు అన్యాయం చేసింది ఏఐటీయూసీనే’



మాట్లాడుతున్న మేడిపెల్లి సంపత్

మందమర్రిరూరల్: సింగరేణిలో ట్రేడ్స్‌మెన్‌లకు అన్యాయం చేసింది ఏఐటీయూసీనే అని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సంపత్ ఆరోపించారు. ఏరియాలోని వర్క్‌షాపులో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో ఎలాంటి సమ్మె లేకుండా కేసీఆర్ నాయకత్వంలో కార్మికులకు కావాల్సిన హక్కులు సాధిస్తే ఏఐటీయూసీ మాత్రమే సాధించినట్టు గొప్పలు చెప్పుకుంటుందని మండిపడ్డారు. యూనియన్ నాయకులు కొండల్‌రావు, రాజశేఖర్, వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

ప్రమోషన్ పత్రాలు అందజేత



ప్రమోషన్ పత్రాలు పొందిన కార్మికులు

శ్రీరాంపూర్: డివిజన్‌లోని ఆర్కే 5 గనిలో కార్మికులకు గని మేనేజర్ అబ్దుల్ ఖాదర్ మంగళవారం పదోన్నతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబర్, 2022వరకు సంవత్సరంలో 190/240 మస్టర్లు పూర్తి చేసిన బదిలీ వర్కర్లకు సంస్థ జనరల్ మజ్దూర్లుగా పదోన్నతిని కల్పించిందన్నారు. గనిలో 185మంది యువ కార్మికులకు ఈ పదోన్నతులు వచ్చాయని తెలిపారు. పదోన్నతి పొందిన వారంతా మరింత బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో గని రక్షణ అధికారి శివయ్య, సంక్షేమ అధికారి రణదీప్ గౌడ్, అసిస్టెంట్ మేనేజర్ రాందాస్, అండర్ మేనేజర్లు హేమంత్, నవీన్, ఎల్లయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, ఫిట్ సెక్రటరీ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అధిక వడ్డీ చెల్లింపు



మాట్లాడుతున్న రామారావు

జైపూర్: పోస్టల్‌శాఖ ద్వారా ఫిక్స్‌డ్ డిపాజిట్లపై బ్యాంకుల కన్నా అత్యధికంగా వడ్డీ చెల్లిస్తున్నట్లు పోస్టల్‌శాఖ సబ్ డివిజనల్ అధికారి రామారావు తెలిపారు. స్థానిక పోస్టాఫీస్‌లో మంగళవారం పోస్టల్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్యాంకుల మాదిరిగానే పోస్టాఫీసుల ద్వారా ప్రజలకు అన్ని రకాలుగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకుల్లో అందిస్తున్న ఆయా రకాల సేవలు పోస్టల్‌శాఖలో అమల్లోకి వచ్చినట్లు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోస్ట్‌మాస్టర్ యోగేందర్, పోస్టాఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

‘మానసిక ప్రశాంతతతోనే సాఫీగా జీవనం’



మాట్లాడుతున్న విద్యాసంస్థల చైర్మన్ భూమేష్

మంచిర్యాలఅర్బన్: శారీరకంగా ఎంత ధృడంగా ఉన్నా మానసిక ప్రశాంతత లేకపోతే జీవితం వృథా అని శ్రీహర్ష డిగ్రీ కళాశాలల చైర్మన్ పల్లె భూమేష్ అన్నారు. కళాశాలలో తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్(టీపీఏ) ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శారీరక ఆరోగ్యం ఎంత ముఖ్యమో, మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమన్నారు. మంచి ఆలోచన, బుద్ధి, ఆశయం, లక్ష్యం నడవడిక ఉంటేనే మానవజీవనం సాఫీగా సాగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సైక్రియాటిస్ట్ అనిల్‌కుమార్, టీపీఏ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణరావు, వయోజన విద్య జిల్లా అధికారి పురుషోత్తం నాయక్, డీఎంఈవో వెంకటేశ్వర్లు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ లింగారెడ్డి, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



మందమర్రిరూరల్: చెన్నూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు మంగళవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. మందమర్రి మండలంలోని ఆదిల్‌పేట్‌కు చెందిన వేల్పుల లింగయ్య, బక్క మల్లయ్య ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పట్టణంలోని మోడో జోన్‌కు చెందిన టీ స్టాల్ సత్యం కుమారుడు మనిదీప్‌కు హైదరాబాద్‌లో ప్రమాదం జరిగి గాయాలు కాగా, వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. శ్రీపతినగర్‌కు చెందిన బుర్ర రాజ్యలక్ష్మి ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి నగదు అందించారు.

సంక్షిప్త వార్తలు

పిచ్చి మొక్కల తొలగింపు

మందమర్రిరూరల్: విజయదశమి నవరాత్రోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఆలయాల ఆవరణలోని పిచ్చి మొక్కలు తొలగించి పరిశుభ్రంగా చేస్తున్నారు. దొరల బంగ్లాస్ సమీపంలోని పోలేరమ్మ ఆలయంలో మున్సిపాలిటీ సిబ్బందితో పాటు బీఆర్ఎస్ నాయకులు పరిసరాలను శుభ్రం చేశారు.

తహసీల్దార్‌కు సన్మానం

జన్నారం: తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టి కొద్ది రోజుల్లోనే బదిలీ అయిన వనజారెడ్డిని మంగళవారం భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో కుట్టు మిషన్ శిక్షణ పొందుతున్న మహిళలు సన్మానించారు.

దుస్తులు పంపిణీ

జన్నారం: మండలంలోని తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ వర్కర్లకు సొంత ఖర్చులతో సర్పంచ్ జాడి గంగాధర్ కొత్త బట్టలు తెచ్చి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యంపల్లిలో వెంగళరావు జయంతి

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లిలో జెడ్పీటీసీ పల్లె చంద్రయ్య, వైస్ ఎంపీపీ విక్రంరావులు దివంగత నాయకుడు వెంగళరావు జయంతిని పురస్కరించుకొని మంగళవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంగళరావు కూతురు అరుంధతి చేతుల మీదుగా 50మంది పేద వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు.

ఆర్థిక సాయం

కాసిపేట: మండలంలోని బుగ్గగూడెం గ్రామపంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా విధులు నిర్వర్తించిన భీమిని నారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా మంగళవారం సర్పంచ్ విజయలక్ష్మి చేతుల మీదుగా గ్రామపంచాయతీ నుంచి కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీవో నాగరాజు, పంచాయతీ కార్యదర్శి సునీత, ఉపసర్పంచ్ రఘుపతి, వార్డుసభ్యులు లక్ష్మి, అక్కవ్వ తదితరులున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నెన్నెల: మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ మహ్మద్ ఇమ్రాన్‌ఖాన్ సందర్శించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో కరెంట్, ఫర్నిచర్, నీటి వసతి, మూత్రశాలలు, వృద్ధుల, దివ్యాంగుల కోసం ర్యాంపులను పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ గణేష్, హైస్కూల్ హెడ్‌మాస్టర్ ప్రకాష్‌రావు ఉన్నారు.